క్లుప్తంగా

చెత్తాచెదారం తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

మహబూబాబాద్: పట్టణంలోని కంకరబోడ్ ప్రాంతంలో రహదారి పక్కన చెత్తాచెదారం పేరుకుపోవడంతో 'అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం' శీర్షికన శుక్రవారం సాక్షిదిన పత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్ ఆదేశాలతో సిబ్బంది.. రహదారి వెంట చెత్త, పిచ్చి మొక్కలను తొలగించారు.

నిబద్ధతతో సేవలందించాలి



మహబూబాబాద్ రూరల్ : పోలీసు అధికారులు, సిబ్బంది తమ నిబద్ధతతో ప్రజలకు సేవలందించాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ సూచించారు. 1990 బ్యాచ్‌కి చెందిన 8 మంది హెడ్ కానిస్టేబుళ్లు.. ఏఎస్సైలుగా పదోన్నతి పొందారు. శుక్రవారం వీరు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. పదోన్నతి పొందిన వారిలో వెంకన్న, సర్వేశ్వర్, శ్రీనివాస్, సుధాకర్ సుధాకర్, వెంకన్న, పీటర్, సాయిలు ఉన్నారు.

దశాబ్దాలుగా.. ఆత్మీయంగా..



కృష్ణమూర్తి శర్మకు రాఖీ కడుతున్న పద్మ (ఫైల్)

పెద్దవంగర: మండలంలోని అవుతాపురం గ్రామానికి చెందిన పోలకొండ లక్ష్మయ్య శర్మ–అమృత దంపతులకు ఆరు గురు సంతానం. శారద, కృష్ణమూర్తి శర్మ, సామ్రాజ్యం, మధు సూదన్ శర్మ, లక్ష్మీ నర్సింహమూర్తి, పద్మ. పెళ్లి చేసుకుని వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నారు. ప్రతి సంవత్సరం రాఖీ పండుగ రోజున నల్లగొండ నుంచి శారద, తుంగతుర్తి నుంచి పద్మ, గ్రామంలో ఉన్న సామ్రాజ్యం సోదరులకు రాఖీ కడతారు. దశాబ్దాలుగా వీరి అనుబంధాన్ని కొనసాగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు

మరిపెడ రూరల్: అమృనాయక్‌తండా నుంచి రాముతండాకు వెళ్లేదారిలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తింగ్ షాట్ సర్క్యూట్ కావడంతో శుక్రవారం మరమ్మతులు చేశారు. లైన్ ఇన్‌స్పెక్టర్ వేమన, సిబ్బంది భాస్కర్, అశోక్ పనులు చేశారు.

విచారణలో వేగం పెంచాలి

మహబూబాబాద్ రూరల్ : ముడుపుగల్ వేంకటేశ్వరాలయంలో జరిగిన చోరీపై విచారణను వేగంగా చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఇందుభారతి శుక్రవారం ఎస్పీ సుధీర్ సుధీర్ రాంనాథ్ కేకన్‌కు ఫిర్యాదు చేశారు.

ఆగిన నిర్మాణం.. అవస్థల్లో జనం

రోడ్డు పనులను మధ్యలో వదిలేసిన కాంట్రాక్టర్

- కంకరతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పనులు పూర్తి చేయాలని వేడుకోలు

గార్ల: అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో బీటీ రహదారి నిర్మాణ పనులు మధ్యలో వదిలేయంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారి గుండా వెళ్లే డాక్యాతండా గ్రామస్తులు నానా ఇబ్బందులు పడుతున్నారు. గార్ల మండలం గోపాలపురం గ్రామం నుంచి డాక్యాతండాకు వెళ్లే బీటీ రహదారి నిర్మాణానికి గత ఎన్నికల ముందు నాటి ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ రూ.కోటి నిధులు మంజూరు చేయించి పనులకు శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి రహదారిపై కంకర పోసి రోలర్‌తో తొక్కించారు. అనంతరం ఎన్నికలు, ఫలితాలు, ప్రభుత్వ మార్పు జరిగింది. ఈక్రమంలో రహదారి పనులు నిలిచిపోయాయి. దీంతో ఏడాదిన్నర నుంచి ఈ రహదారి వెంట వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. రోడ్డు సరిగా లేకపోవడంతో 108 అంబులెన్స్, ఆటోలు సైతం రావడం లేదని అత్యవసర సమయంలో ఇబ్బంది ఉంటుందని ప్రజలు వాపోతున్నారు.



కోతకు గురైన కంకర పోసిన రోడ్డు

ఆటోలు రావడం లేదు



2023 సంవత్సరంలో నాటి ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ గోపాలపురం నుంచి డాక్యాతండా వరకు రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కానీ పనులు పూర్తి కాలేదు. కంకర రహదారిపై గార్లకు వస్తూ ఇబ్బందులు పడుతున్నాం. తండాకు కనీసం ఆటోలు సైతం రావడం లేదు.

– భూక్య భారతి, మాజీ సర్పంచ్, గోపాలపురం

ఆత్మీయ వేడుక రక్షాబంధన్

అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల ఆత్మీయ వేడుక రాఖీ పండుగ. దీంతో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా వెలసిన రాఖీ షాపుల వద్ద మహిళలు, యువతుల సందడి కన్పించింది. సోదరులకు ఇష్టమైన రాఖీలు, స్వీట్లు కొనుగోలు చేశారు. ఇదిలా ఉండగా.. పలు విద్యాసంస్థల్లో శుక్రవారం ముందస్తుగా రాఖీ వేడుకలను నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ అర్బన్: స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్‌లో..



డోర్నకల్: రాఖీ షాపు మహిళల వద్ద సందడి



తొర్రూరు: చెట్టుకు రాఖీ కట్టుతున్న విద్యార్థులు

కొత్తపల్లిలో పోలీసుల కార్డన్ సెర్చ్

కొత్తగూడ: మండలంలోని కొత్తపల్లిలో శుక్రవారం గూడూరు సీఐ సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. తెల్లవారు జామునే గ్రామాన్ని చుట్టు ముట్టిన పోలీసులు ఆధారాలు లేని ద్విచక్ర వాహనాలు, బెల్టు షాపుల్లో మద్యం బాటిల్లు స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా కేంద్రాలపై దాడులు నిర్వహించి గుడుంబా తయారీకి వినియోగించే బెల్లం పానకం, గుడుంబాను ధ్వంసం చేశారు. అనంతరం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. గుడుంబా తయారు చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరం అన్నారు. గుడుంబా తాగడం వల్ల వచ్చే నష్టాలను వివరించారు. చట్ట వ్యతిరేకమైన చర్యలు ఎక్కడ జరిగినా సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కొత్తగూడ, గంగారం, గూడూరు ఎస్సైలు రాజ్‌కుమార్, రవికుమార్, గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గుడుంబా

వరాలివ్వమ్మా.. వరలక్ష్మి

శ్రావణ శుక్రవారం నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా మహిళలు వరలక్ష్మి వ్రతాలను నిర్వహించుకున్నారు. ఇరుగుపొరుగు ముత్తయిదువులను ఆహ్వానించి వాయినాలను ఇచ్చిపుచ్చుకున్నారు. నిండునూరేళ్లు సౌభాగ్యంగా ఉండేలా దీవించాలని అమ్మవారికి కోరుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మరిపెడ రూరల్: బీచ్‌రాజుపల్లిలో..



మహబూబాబాద్ రూరల్ : బీసీ కాలనీలో..



గార్ల లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో..



బయ్యారంలో..



చిన్నగూడూరు: వాయినాలతో మహిళలు



నెల్లికుదురు: ఇనుగుర్తి మండలం చిన్ననాగారంలో..



డోర్నకల్ సాయిధ్యాన మందిరంలో..

బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

కురవి: గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొణతం పెంటయ్య అన్నారు. మండల కేంద్రంలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ చేపట్టిన సంక్షేమ పథకాలను శుక్రవారం ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీతోనే దేశం అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు భూక్య కిషన్ నాయక్, నాయకులు కోడి రామకృష్ణ, కొణతం వెంకటేశ్, శేషగాని సరిత, రాంజీ, రమేష్, సుమన్, దేవేందర్, స్వామి, విష్ణు పాల్గొన్నారు.

నియామకం

గూడూరు: మండల కేంద్రానికి చెందిన నల్లగొండ అనిల్‌ను భారతీయ జనతా పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ శుక్రవారం రాష్ట్ర పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన కృషిని గుర్తించి మండల పార్టీలో స్థానం కల్పించేందుకు కృషి చేసిన మండల, జిల్లా పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



కురవి: ప్రచారంలో పాల్గొన్న నాయకులు

బిహార్ రాష్ట్రంలో ఓట్ల తొలగింపు అన్యాయం



నెహ్రూసెంటర్: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఎం నాయకులు



డోర్నకల్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

నెహ్రూసెంటర్/ కురవి/డోర్నకల్/గార్ల/ తొర్రూరు /కేసముద్రం : బిహార్ రాష్ట్రంలో ఓట్ల తొలగింపు అన్యాయమని సీపీఎం నాయకులు అన్నారు. బిహార్‌లో ఓట్ల తొలగింపున వ్యతిరేకిస్తూ జిల్లా వ్యాప్తం ఆ పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ జిల్లా కార్యవర్గ సభ్యుడు అలువాల వీరయ్య, డోర్నకల్ సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సోమయ్య, గునిగంటి రాజన్న, గార్లలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనివాసరావు, అలువాల సత్యవతి, తొర్రూరు మండల కార్యదర్శి యాకుబ్, కేసముద్రం కిషన్, గొడిశాల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

తొర్రూరు: విశ్రాంత ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వ విశాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మైస నాగయ్య కోరారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని అయన్స్‌క్లబ్ భవనంలో జనరల్‌బాడీ సమావే శం నిర్వహించారు. సమావేశంలో విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై మాట్లాడారు. అనంతరం 2025–28 సంవత్సరానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. తొర్రూరు మండల అధ్యక్షుడిగా ఇట్టి సోమిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎండీ యాకుబ్, కోశాధికారిగా వీరభద్రయ్య, అసోసియేట్ అధ్యక్షుడిగా మన్నూరు కోటయ్య, ఉపాధ్యక్షుడిగా వినోద్ రెడ్డి, మహిళా విభాగం నుంచి ఉపాధ్యక్షురాలిగా పద్మ, సంయుక్త కార్యదర్శిగా బాలాజీ, కార్యనిర్వాహక కార్యదర్శి చెన్నోజు విజయ్ కుమార్, ప్రచార కార్యదర్శిగా వెంకటనారాయణ నియమితులయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగయ్య

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి

నెహ్రూసెంటర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ బలపరిచిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం నెల్లూరు నాగేశ్వర్‌రావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయసారథి మాట్లాడుతూ.. ప్రజల సమస్యలపై పోరాటాలు నిర్వహించే సీపీఐని ఎన్నికల్లో ప్రజలు ఆదరించాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఖమ్మం జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ అయోధ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధకరమని అన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శులు అజయ్‌సారథిరెడ్డి, సుధాకర్ రెడ్డి, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, పాండురంగాచారి, వెంకన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయసారథి

సాగులో యాజమాన్య పద్ధతి పాటించాలి

నర్సింహులపేట: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పత్తిపంటలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై శుక్రవారం ఏఓ వినయ్‌కుమార్ పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. పత్తిలో తేమ లేకుండా చేయాలన్నారు. ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల పోటాష్‌ను 5 -7సె.మీ దూరంలో వేయాలని చెప్పారు. అంతర సేద్యం సాధ్యం కాకుంటే 30–35 దశలో ప్రొపక్విజలోఫాప్ 10 శాతం ఈసీ 250 మీ.లీ, పైరీ థియోబాక్ సోడియం 250 మీ.లీ ఎకరాకు స్ప్రే చేయాలని సూచించారు. అధిక వర్షాలకు నల్ల నేలల్లో వేరుకుళ్ల తెగులు వచ్చే అవకాశం ఉందని, కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములను లీటర్ నీటిలో కలిపి మొక్క మొదల్లో తడపాలని సూచించారు. రైతులు, ఏఈఓ మౌనిక పాల్గొన్నారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ వినయ్‌కుమార్

ప్రజాస్వామ్యానికి జర్నలిజం మూలస్తంభం

నెహ్రూసెంటర్: ప్రజాస్వామ్యానికి జర్నలిజం మూలస్తంభమని డీఎంహెచ్ఓ రవిరాథోడ్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ నెహ్రూనాయక్ అన్నారు. ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ జిల్లా రెండో మహాసభ శుక్రవారం ఐఎంఏ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వాలకు వారధిగా పని చేస్తూ ప్రజా సమస్యలను వెలికితీస్తున్న జర్నలిస్టుల సేవలు వెల కట్టలేనివని పేర్కొన్నారు. టీడబ్ల్యూజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ వెంకన్న, బానోత్ లక్ష్మణ్, శ్రీనివాస్, గుట్టయ్య, విజయ, శ్రీహరి, ఉదయ్‌ధీర్, శేఖర్, భగవాన్, హరినాయక్, బీమానాయక్ పాల్గొన్నారు.

వ్యక్తిని కాపాడిన పోలీసులు

మహబూబాబాద్ రూరల్ : ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తిని పోలీసులు కాపాడారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ పట్టణంలోని హైమ గార్డెన్ ఎదురుగా రైల్వే ట్రాక్ వద్ద ఓ వ్యక్తి ఆత్మహత్యయత్నం చేసుకుంటున్న సమాచారం ట్రాఫిక్ ఎస్సై అరుణ్ కుమార్‌కు రావడంతో ట్రాఫిక్ కానిస్టేబుల్ మాలోత్ పాప్‌లాల్‌కు తెలియజేశారు. దీంతో ఆయన ఘటన స్థలానికి చేరుకుని బాధితుడిని రక్షించారు. సదరు వ్యక్తిని పోలీసు స్టేషన్ తీసుకొచ్చి విచారించి పరకాల పట్టణానికి చెందిన హోటల్ వ్యాపారం చేసే ఎర్ర రామకృష్ణగా గుర్తించారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో మేనమామ ఊరైన మహబూబాబాద్ వచ్చి ఆత్మహత్యకు యత్నించినట్లు అంగీకరించాడు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు చేయాలి

నెల్లికుదురు: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను అమలు చేయాలని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజంపల్లి వీరన్న డిమాండ్ చేశారు. మండలంలోని వావిలాల, ఎర్రబెల్లిగూడెం గ్రామాల్లో శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద నిరసన తెలిపిన అనంతరం కార్యదర్శులకు వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

పింఛన్ పెంచి ఇవ్వాలి

కురవి: వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులకు ఇచ్చే పింఛన్ డబ్బులను పెంచాలని ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు అన్నారు. శుక్రవారం వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎండీ పాషా అధ్యక్షతన మండల కేంద్రంలో నిర్వహించిన వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

డాక్టరేట్ ప్రదానం

మరిపెడ రూరల్: మరిపెడ మండలం తానంచర్ల రెవెన్యూ పరిధిలోని మూల మత్రితండాకు చెందిన వాంకుడోతు బాలు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ పట్టా పొందాడు. ప్రొఫెసర్ కృష్ణవేణి పర్యవేక్షణలో బాలు తన పరిశోధన పూర్తి చేశాడు. డాక్టరేట్ పొందిన బాలును కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అభినందించారు.

విమర్శలు అర్థరహితం

మహబూబాబాద్ రూరల్ : ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి మాజీ ఎంపీ మాలోత్ కవితది కాదని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాహుల్ గాంధీ, బీసీ రిజర్వేషన్‌పై గురువారం మాలోత్ కవిత చేసిన విమర్శలను బలరాంనాయక్ తిప్పికొట్టారు. బీసీ రిజర్వేషన్ పై బీఆర్ఎస్ పార్టీ, కవిత వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బీసీల మీద ప్రేమ చూపిస్తున్న కవిత.. బీఆర్ఎస్ 35 శాతం ఉన్న రిజర్వేషన్లను 23 శాతానికి ఎందుకు తగ్గించారని ప్రశ్నించారు.

సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

మరిపెడ రూరల్: సబ్సిడీపై రైతులకు వ్యవసాయ పనిముట్లు అందించనున్నట్లు మరిపెడ మండల వ్యవసాయ శాఖ అధికారి బోడ వీరసింగ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మరిపెడ మండలానికి 26 పవర్ స్ప్రేయర్ (పెట్రోల్ పంపు) 11 ట్రాక్టర్ రోటోవేటర్ మొదటి విడతగా మండలానికి కేటాయించినట్లు తెలిపారు. సన్న, చిన్నకారు, ఎస్టీ, ఎస్సీ, జనరల్ మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీ, ఇతర పెద్ద రైతులకు 40 శాతం సబ్సిడీ వర్తించనున్నట్లు తెలిపారు. అర్హులైన రైతులు ఏఈఓ వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం కావాల్సిన పత్రాలు, వివరాల కోసం ఏఈఓను సంప్రదించాలని తెలిపారు.

చెట్లను తొలగించిన దుండగులు

తొర్రూరు రూరల్: మండలంలోని చీకటాయపాలెంలో ఈజీఎస్ పథకంలో భాగంగా అవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలు ఏపుగా పెరిగాయి. ఈ చెట్లను శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు తొలగించారు. దీంతో స్థానిక కార్యదర్శి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సుమారు 20 చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు కూల్చేశారని కార్యదర్శి మహ్మ ద్ షరీఫ్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

నర్సింహులపేట: మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి జయపురం, కొమ్ములవంచతోపాటుగా పలు తండాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కొమ్ములవంచ, తండాలో రెండు స్తంభాలు కూలడంతో రాత్రి 10 గంటల నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. శుక్రవారం విద్యుత్ ఏఈ పాండు పర్యవేక్షణలో విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేపట్టి మధ్యాహ్నం 12 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

నల్లబెల్లం స్వాధీనం

కురవి: ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన క్వింటా నల్లబెల్లాన్ని పట్టుకున్నట్లు సీరోలు ఎస్సై సంతోష్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సీరోలు మండలం ఉప్పరిగూడెం శివారు గోపతండాలో గుగులోత్ షేరు అనే వ్యక్తి తన ఇంట్లో అక్రమంగా నల్లబెల్లం నిల్వ చేసినట్లు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి బెల్లం స్వాధీనం చేసుకుని షేరుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

నెల్లికుదురు: ప్రతి విద్యార్థి చదువుతోపాటు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ భూక్య నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాతీయ సేవాపథకం సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడారు. దేశ భవిష్యత్ యువతపై ఆధారపడి ఉందని యువత సన్మార్గంలో నడిచి దేశ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. సమాజంపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

జ్వరాలను నిర్లక్ష్యం చేయకూడదు



దంతాలపల్లి: సీజనల్ వ్యాధులు, జ్వరాలపై నిర్లక్ష్యంగా ఉండకుండా వెంటనే ఆస్పత్రికి వెళ్లాలని పల్లె దవాఖాన డాక్టర్ వాణి అన్నారు. మండల వైద్యురాలు కవిత ఆదేశాల మేరకు మండలంలోని రామవరం గ్రామంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో జ్వరాలు, జలుబుతో బాధ పడుతున్న 75 మందికి పరీక్షలు నిర్వహించారు.

ఇంట్లో చోరీ

చిన్నగూడూరు: మండల కేంద్రంలో తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన దాసరి నిర్మల ఉపాధి నిమిత్తం వరంగల్‌కు తరలివెళ్లారు. ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి ఇత్తడి సామాన్లను అపహరించారు. గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. రూ.30 వేలు విలువైన సామాన్లు చోరీ జరిగిందని గుర్తించిన బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

విజయవంతం చేయాలి

బయ్యారం: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శనివారం బయ్యారంలో నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల జేఏసీ చైర్మన్ ప్రకాశ్, వైస్ చైర్మన్ అలెం కృష్ణ శుక్రవారం పిలుపునిచ్చారు.

గౌడ యువజన సంఘం కమిటీ ఎన్నిక

నెహ్రూసెంటర్: గౌడ యువజన సంఘం మహబూబాబాద్ పట్టణ, మండల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దీపక్‌గౌడ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పట్టణ అధ్యక్షుడిగా కాంచని శంకర్, ప్రధాన కార్యదర్శిగా మారగాని సురేష్, ఉపాధ్యక్షులుగా గునిగంటి ప్రశాంత్, మూల సూరి, కోశాధికారిగా కాడెం భరత్, కార్యదర్శులుగా చిర్రగాని వంశీ, తొండల విజయ్‌ని ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా జెర్రిపోతుల గణేష్, ప్రధాన కార్యదర్శిగా చల్లమల్ల సాయికుమార్, ఉపాధ్యక్షులుగా చిర్ర విజయ్, రాంపల్లి నరేష్, కోశాధికారిగా శామకూరి హరికృష్ణ, జిల్లా ఉపాక్షుడిగా నలమాస సుధాకర్‌ను ఎన్నికున్నట్లు దీపక్‌గౌడ్ తెలిపారు. నలమాస సాయి, గాడిపెల్లి చరణ్, గందు కార్తీక్, తండ సందీప్, హేమంత్‌గౌడ్, సంపత్‌గౌడ్ పాల్గొన్నారు.